క్లుప్తంగా

ఒకే చోట రెండు వీధి లైట్లు



ఒకే చోట్ల ఏర్పాటు చేసిన రెండు లైట్లు

ఏలేశ్వరం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఒకేచోట రెండు లైట్లు వేసి మున్సిపల్ అధికారులు తమ ప్రజాసేవను చాటుకున్నారు. పట్టణంలో ప్రధాన రహదారితో పాటు పలు ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో స్థానికులు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం కానరా లేదు.అలాంటిది స్థానిక దిబ్బలపాలెంలోని జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో ఒకేచోట కలిసి ఉన్న రెండుస్తంభాలకు రెండు లైట్లు వేశారు. దీనిపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కోడిపందేలాడుతున్న ఐదుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై జగ్గంపేట ఎస్సై రఘునాధరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో కోడి పందేలాడుతన్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి మూడు కోడిపుంజులు, రూ.5500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులపై నిఘా పెట్టామని, యువత బెట్టింగ్ ఉచ్చులో పడి భవిష్యత్ పాడుచేసుకోవద్దని సూచించారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

గోకవరం: మండలంలోని జగన్నాథపురం గ్రామ శివారున నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై ఆదివారం గోకవరం ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం తమకు అందిన సమాచారం మేరకు గ్రామ శివారున నిర్వహిస్తున్న కోడి పందేలపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రెండు కోడికత్తులు, రూ.720 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల రిలే దీక్షలు



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డ్రైవర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న రిలే దీక్షలు ఆదివారం 28వ రోజూ కొనసాగాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఎస్వీ రమణను 1/2009 సర్కులర్‌కు విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగులు ధర్నాలు చేస్తున్న యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎస్వీ రమణను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంయూ డిపో కార్యదర్శి టి.త్రిమూర్తులు, ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, డ్రైవర్లు కేఎస్ రాజు, వైఏ రావు తదితరులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ మ్యాగజైన్ ఆవిష్కరణ



ఫోరెన్సిక్ మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటిలో ఫోరెన్సిక్ సైన్స్ మ్యాగజైన్ 5వ సంచికను ఆదివారం జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆవిష్కరించారు. ఆధునిక నేర పరిశోధనల్లో ఫోరెన్సిక్స్ సైన్స్ ప్రాముఖ్యతపై దీనిలో తెలియజేసినట్టు ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్, బీవీఎస్ఎస్ ఉదయనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో రోడ్లు ప్రారంభం



సీతానగరంలో సిమ్మెంట్ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: జగ్గంపేట శివారు సీతానగరంలో రూ.60 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదివారం ప్రారంభించారు. జె.కొత్తూరు నుంచి బలభద్రపురం గ్రామనికి నూతనంగా వేస్తున్న బీటీ రోడ్డును ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్లు నిర్మాణం చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.



ఎస్.అన్నవరంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న దాడిశెట్టి రాజా దంపతులు



తంటికొండ దేవస్థానంలో పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితుడు సుబ్బారావుశర్మ



జి.కొత్తపల్లిలో పంచాంగ పఠనం చేస్తున్న పురోహితుడు



తాళ్లూరులో విశేష అలంకరణలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు

ఊరూవాడా ఉగాది

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పంచాంగ పఠనం చేసిన పండితులు
- గ్రామాల్లో సందడి వాతావరణం



ఏలేశ్వరంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: విశ్వావసు నామసంవత్సర ఉగాది వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. మహిళలు ఉదయాన్నే తమ ఇళ్ల వద్ద షడ్రుచులతో ఉగాది పచ్చడి చేయగా కుటుంబ సభ్యులు స్వీకరించారు. గ్రామ గ్రామాన పండితులు పంచాంగ పఠనం చేశారు. డొక్కా సీతమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక బాలాజీచౌక్ వద్ద సభ్యులు సంప్రదాయ వస్త్రాలు ధరించి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో పురోహితుడు గాథావఝుల సూర్యనారాయణ పంచాంగ పఠనం చేశారు. స్థానిక శివాలయం, సత్యనారాయణస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రౌతులపూడి: ఉగాది వేడుకలు మండలవ్యాప్తంగా వైభవంగా జరిగాయి. దేవాలయాలకు తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రౌతులపూడిలోని ఉమారామలింగేశ్వరస్వామి, కనకదుర్గమ్మ, శృంగవరం–మెరక చామవరం సమీపంలోని నందనవనంలో స్వయంభుగా వెలసిన నాగలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పంచాంగ శ్రవణం నిర్వహించారు.

ప్రత్తిపాడు రూరల్: మండలవ్యాప్తంగా ఉగాది వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో వేద పండితులు పంచాగ పఠనం చేయగా భక్తులు శ్రవణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు క్యూ కట్టారు.

స్వామివారిని దర్శించిన మాజీ మంత్రి దాడిశెట్టి రాజా దంపతులు

తుని రూరల్: ఉగాది సందర్భంగా ఆదివారం గ్రామాల్లో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పలు ఆలయాల్లో అర్చకులు పంచాంగ పఠనం చేసి రాశి ఫలాలు, ఆదాయ, వ్యయాలను తెలియజేశారు. ఎస్.అన్నవరం, ఎన్.సూరవరం, తేటగుంట, విష్ణుపురం, డి.పోలవరం, వి.కొత్తూరు, దొండవాక, రాపాక, చామవరం, రేఖవానిపాలెం, హంసవరం, టి.తిమ్మాపురం, జగన్నాథగిరి గ్రామాల్లో ఆలయాలకు భక్తులు చేరుకుని స్వామిఅమ్మవార్లను దర్శించి, పూజలు చేశారు. ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా దంపతులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి అర్చకులు వేదాశీస్సులు అందించారు.

గండేపల్లి: తాళ్లూరు శివాలయంలో ఉగాది ఆస్థానం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకాలు, బాలత్రిపుర సుందరి అమ్మవారికి కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. మెట్ట ప్రాంతానికి చెందిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్తిపాడు: మండల వ్యాప్తంగా ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు ఆలయాలను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్తిపాడులోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి పంచాయతన క్షేత్రంలో ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారిపై గల పాదాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అర్చనలు భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు ఆవరణలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ ముక్కు సుబ్రహ్మణ్యం, బర్రే కోటేశ్వరరావు, చిత్రా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: ఉగాది పండగను పురస్కరించుకుని మండలంలోని ఆలయాలు కిటకిటలాడాయి. తంటికొండలో ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర ఆధ్వర్యంలో వేదపండితులు ద్విభాష్యం సూర్యవెంకటసుబ్బారావుశర్మ పంచాంగ పఠనం చేశారు. గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉగాది సందర్భంగా ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ పంచాంగ పఠనం చేశారు. స్థానిక దాసరి వారి వీధిలోని రామాలయంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ దాసరి చిన బాబు, భక్తులు పాల్గొన్నారు.

తుని: ఉగాదిని పురస్కరించుకుని నియోజకవర్గంలోని పట్టణాలు, గ్రామాల్లో తెలుగుదనం ఉట్టిపడింది. ప్రజలు ఉదయాన్నే వేప పువ్వు, వివిధ రకాల దినుసులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని స్వీకరించారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా కుటుంబ సభ్యులతో కలిసి తునిలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

తొండంగి: ఉగాదిని పురస్కరించుకుని మండలంలోని తొండంగి, బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం, రావికంపాడు, శృంగవృక్షం, గోపాలపట్నం, పెరుమాళ్లపురం, ఏవీ నరగం, పైడికొండ, పి.అగ్రహారం, వేమవరం తీర ప్రాంత గ్రామాల్లో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పండితులు పంచాంగ పఠనం చేశారు. దానవాయిపేట, ఏవీ నగరం, బెండపూడి, యర్రయ్యపేటలో వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం ఆలయాల్లో భజనలు, భక్తిపాటలు ఆలపించారు.

శంఖవరం: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రజలు ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలకు భక్తులు తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు పంచాంగ పఠనం చేశారు. గ్రామాల్లోని ఆలయాల వద్ద తప్పెటగుళ్లు, భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో రైతులు ఏరువాక సాగారు.



ధర్మవరంలో నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కిర్లంపూడి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని పలు ఆలయాల్లో పండితులు పంచాంగ పఠనం నిర్వహించారు. నూతన సంవత్సరంలో జరిగే విశేషాలను తెలుసుకునేందుకు భక్తులు ఆసక్తి కనబరచారు. కాగా కిర్లంపూడిని వేంచేసిన నూకాలమ్మ ఆలయం వద్ద అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు అమ్మవారి తీర్థంలో సందడి చేశారు.

రత్నగిరికి ఉగాది శోభ

అన్నవరం: విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు రత్నగిరిపై ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రత్నగిరిపై సత్యదేవుని ఆలయం, ఆలయ ప్రాంగణం, అనివేటి మండపాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అనివేటి మండపం వెలుపల, లోపల, స్వామి, అమ్మవార్లను ప్రతిష్ఠించిన వేదికపై చేసిన ఆలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఉదయం 10.30 గంటలకు రత్నగిరి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సత్యదేవుని రథోత్సవంలో రథం లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. రాజగోపురం వద్ద పూలతో చేసిన కలశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



రత్నగిరిపై అనివేటి మండపం వద్ద పుష్పాలంకరణ

గజవాహనంపై సత్యదేవుని ఊరేగింపు



వెండి గజవాహనం మీద సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుడు, అమ్మవారిని ఆదివారం వెండి గజవాహనంపై అన్నవరంలో ఊరేగించారు. రాత్రి 7.30 గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని ఆలయం నుంచి మెట్ల మార్గాన పల్లకీ మీద ఊరేగింపుగా కొండదిగువకు తీసుకువచ్చారు. అక్కడ వెండి గజవాహనం మీద స్వామి, అమ్మవార్లను ప్రతిష్ఠించి పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రధానాలయానికి చేర్చారు.

సీనియర్ వాకర్లకు సత్కారం



తునిలో సీనియర్ వాకర్లను సత్కరిస్తున్న దృశ్యం

తుని: స్థానిక గణపతినగర్ మున్సిపల్ పార్కులో సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సీనియర్ వాకర్లు పెనుగొండ తిరుపతయ్య, ఆర్ఎస్ఎన్ మూర్తిలను సత్కరించారు. వాకర్ తిరుపతయ్య సేవా కార్యక్రమాలు చేసి ఆదర్శనీయుడుగా నిలిచారని వక్తలు కొనియాడారు. సిటీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు లోకారెడ్డి అప్పారావు, డిప్యూటీ గవర్నర్ సీహెచ్ సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎం.శివ, కార్యదర్శి రాజు, కోశాధికారి సత్తిబాబు, గౌరవ అధ్యక్షుడు కుచ్చర్లపాటి భీమరాజు, సిటీ కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శ్రేణుల పథ సంచలనం



ప్రత్తిపాడులో ఆర్ఎస్ఎస్ కార్యకర్తల పథ సంచలనం

ప్రత్తిపాడు: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఎదిగి, దేశం కోసం–ధర్మం కోసం పని చేస్తోందని ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ మల్లిబాబు అన్నారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవరావు బలిరామ్ హెగ్డేవార్ జయంతి సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో ఆర్ఎస్ఎస్ సభ్యుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. తొలుత భారత మాత, హెగ్డేవార్, గురూజీ చిత్రపటాలకు భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా, శింగిలిదేవి అప్పారావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పథ సంచలనం నిర్వహించారు. తోట వీధి, కొత్తపేట, మునసబు గారి రామాలయం వీధి, మెయిన్‌రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, అల్లూరి సీతారామరాజు మీదుగా కొనసాగింది. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ మొండి వీరవెంకట రమణ, హిందూ ధర్మ రక్షా సమితి అధ్యక్షుడు కర్రి ధర్మరాజు, బర్రే కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తునిలో ఆర్ఎస్ఎస్ కవాతు

తుని: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో స్థానిక శ్రీప్రకాష్ విద్యా నికేతన్‌లో ఉగాది వేడుకలు నిర్వహించినట్టు సంఘ్ ప్రతినిధి చదరం నర్సింగరావు తెలిపారు. తొలుత ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవరావు బలరామ్ హెగ్డేకు నివాళులర్పించారు. లయోలా విద్యాసంస్థల అధినేత దండెం రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉగాది పండగ ప్రాముఖ్యతను భారత్ వికాస్ పరిషత్ దక్షిణాది రాష్ట్రాల కార్యదర్శి డి.పురుషోత్తమ్ శాస్త్రి వివరించారు. అనంతరం ఆర్ఎస్ఎస్ సేవకులు పుర వీధుల్లో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో రాయపరాజు, ప్రసాద్, కుమార్, రాంకుమార్, కుందెం సత్యనారాయణ, స్వయం సేవకులు పాల్గొన్నారు.

ప్రముఖ సిద్ధాంతి 'తేజోమూర్తుల' మృతి



తేజోమూర్తుల లక్ష్మీ నరసింహమూర్తి (ఫైల్)

ప్రత్తిపాడు: గ్రామానికి చెందిన ప్రముఖ సిద్ధాంతి తేజోమూర్తుల లక్ష్మీనరసింహ మూర్తి (77) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. ప్రత్తిపాడు పరిసర గ్రామాల్లో 40 ఏళ్లుగా ఆయన పురోహిత్యం చేస్తున్నారు. జ్యోతిష్యం, వాస్తు రంగాల్లో సిద్ధహస్తుడు. ఏటా ఉగాది వేడుకల్లో ఆయన పంచాంగ పఠనం చేసేవారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఆయన పంచాంగ పఠనాలు చేసి ఎన్నో సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం ఉన్నారు.

పేకాడుతున్న పది మంది అరెస్ట్

తుని: స్థానిక కొండవారిపేటలో పేకాట శిబిరంపై దాడి చేసి 10 మందిని అరెస్ట్ చేశామని పట్టణ సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా పేకాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు సీఐ తన సిబ్బందితో దాడి చేశారు. పది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2100 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

రౌతులపూడి: ఎస్.పైడిపాలలో శనివారం రాత్రి రెండు కుటుంబాల మధ్య తలెత్తిన ఘర్షణలో 11 మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. పల్లెం సత్యవతి కుటుంబానికి చెందిన ఒకరు రోడ్డును నిర్బందించి పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకోవడంతో అదే రోడ్డుపై మోటారు సైకిల్‌పై ప్రయాణించిన అరివేడి దానయ్య కుటుంబీకులు ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ నెలకొంది. ఇరు కుటుంబాలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

వైభవంగా శ్రీకామధేను మహాయజ్ఞం



శ్రీసురభి కామధేను మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ శాస్త్రి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలోని అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీసురభి కామధేను మహా యజ్ఞాన్ని వైభవంగా నిర్వహించారు. లక్షా ఎనిమిదివేల గోవు పిడకలు, 250 కేజీల ఆవు నెయ్యి, 21 ఔషధాలతో తయారు చేసిన 250 కేజీల హోం పొడి, ఒక టన్ను సమిధలు, సుగంధ ద్రవ్యాలతో శ్రీసురభి కామధేను మహా యజ్ఞాన్ని 108 మంది వేద పండితులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. న్యూఢిల్లీ కోస్టల్ ఇండియా డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ జీవీఆర్ శాస్త్రి చేతుల మీదుగా శ్రీసురభి కామధేను మహాయజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలభైరవ, చండీ మహాయజ్ఞం, ఏకాదశి మహారుద్రాభిషేకం నిర్వహించినట్లు శాస్త్రి తెలిపారు. అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆశ్రమ పీఠాధిపతి స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దశదిశలా తలుపులమ్మ ఖ్యాతి

- ఆలయంలో పంచాంగ పఠనం
- వేద పండితుడికి ఘనంగా సత్కారం



పంచాంగ పఠనం చేస్తున్న వేద పండితులు, ప్రధాన అర్చకులు

తుని రూరల్: శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో తలుపులమ్మ అమ్మవారి ఖ్యాతి దశదిశాలా వ్యాప్తి చెందుతుందని వేద పండితులు పేర్కొన్నారు. ఆదివారం అమ్మవారికి వేద పండితులు, ప్రధాన అర్చకులు, అర్చకులు విశేషంగా అభిషేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పుష్పాలంకరణ చేశారు. పంచలోహ విగ్రహాల ప్రాంగణంలో పంచాంగ పఠనం నిర్వహించారు. భక్తులకు వేదాశీర్వచనం చేశారు. దేవదాయశాఖ అధికారుల సూచనలతో వేద పండితులు ముష్టి వెంకట పురుషోత్తమ శర్మ, అర్చకులు దూలం నాగేశ్వరరావు, కొడమంచిలి బాల సుబ్రహ్మణ్యంకు శేష వస్త్రాలతో సత్కరించి, ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సూపరింటెండెంట్‌లు కేఓ.రమణ, మూర్తి, ఏఈలు శ్రీను, గ్రంధి వీరభద్రరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ త్రినాథరావు, భక్తులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై దర్యాప్తు చేయాలి



జగ్గంపేటలో బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడిన క్రైస్తవులు

జగ్గంపేట: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిజ నిర్ధారణ చేయాలని క్రైస్తవ సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు ఆదివారం జగ్గంపేటలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. జగ్గంపేట పాస్టర్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్గంపేట దేవి సెంటర్ నుంచి కాకినాడ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ ర్యాలీ చేసి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని దర్యాప్తు చేయించాలని క్రైస్తువులు డిమాండ్ చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

హంసవరంలో ఐక్యతా ర్యాలీ

తుని రూరల్: మండలంలోని హంసవరంలో ఆదివారం క్రైస్తవులు శాంతియుతంగా ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. బాప్టిస్ట్ చర్చి, రోమన్ క్యాథలిక్ చర్చి పాస్టర్ బాలశౌరి, చిత్రసేన్ లిమ్మా, జైభీమ్ మాల మహానాడు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి తంతటి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణం క్రైస్తవులను మనోవేదనకు గురిచేసిందని, ఆయన ఆత్మకు శాంతికలగాలని కోరుతూ శాంతి ర్యాలీ నిర్వహించినట్టు వారు పేర్కొన్నారు. క్రైస్తవ సంఘాల నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

గోకవరం: గ్రామంలో పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం స్థానిక బంగాళాపేటలో 112 కాల్‌కు పోలీస్ సిబ్బంది హాజరుకాగా పెనుగుల సతీష్ అనే వ్యక్తి పోలీస్ సిబ్బందితో వాగ్వాదానికి దిగా వారి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేశామన్నారు. విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.